నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | జనవరి 23, 2024 | www.navatelangana.com

వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

కాసిపేట : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. పోటీలను కాంప్లెక్స్ హెచ్ఎం సాంబమూర్తి ఆధ్వర్యంలో చేపట్టారు. ఉపన్యాస పోటీల్లో మోడల్ స్కూల్ ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని రమ్య ప్రథమ స్థానంలో నిలిచింది. వ్యాసరచన పోటీలో దేవాపూర్ డీఏవీ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని పూర్ణేశ్వరి ప్రథమ స్థానంలో నిలిచింది. గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 23న మంచిర్యాలలో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో వాసాల ప్రభాకర్ తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా రమణారెడ్డి, అరుణకుమారి, చిన్నయ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

ఇచ్చోడ : ఎయిడ్స్ వ్యాధిపై గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడానికి సోమవారం కళాకారులు కళాజత ప్రదర్శన లిచ్చారు. మండల కేంద్రంలో కళాకారులు తమ ఆట పాటల రూపంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు గురవుతున్నారన్నారు. స్టైల్ పేరుతో కటింగ్ షాపుల్లో ఒకే బ్లేడు ఉపయోగించడం వల్ల వ్యాధులు వస్తాయని తెలిపారు. ఎయిడ్స్‌గ్రస్తులు తగు జాగ్రత్తతో ఉంటే ఇతరులకు ఎటువంటి హాని కలగదని చెప్పారు. ఎయిడ్స్ ఉన్నట్లు అనుమానం ఉన్నవారు జిల్లా కేంద్రంలో గల డీఎంఅండ్‌హెచ్ఓ ఆఫీస్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యు కుంబాయి, కళాజత బృంద నాయకులు కాత్లే శ్రీధర్, ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు చాహకటి తానుబాయి, కార్యదర్శి ఆనంద్, కళాకారులు పాల్గొన్నారు.



కొత్త మండలాలపై అయోమయం..!

- ఏర్పాటు చేస్తూ ఆరు నెలల క్రితం గెజిట్ విడుదల
- కార్యాలయాలు, అధికారుల నియామకంలో జాప్యం
- అంతలోనే ఎన్నికలు..మరుగున పడిన ప్రక్రియ
- కొత్త సర్కారు నిర్ణయంపైనే అందరి దృష్టి

ఆదిలాబాద్ జిల్లాలో కొత్త మండలాల ఏర్పాటుపై అయోమయం నెలకొంది. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మూడు కొత్త మండలాలను ఏర్పాటు చేసి గెజిట్ విడుదల చేసింది. ఈ ప్రక్రియ జరిగి ఆరు నెలలు గడుస్తున్నా..ఎలాంటి రూపురేఖలు సంతరించుకోవడం లేదు. కేవలం గెజిట్ విడుదలకే పరిమితమైంది తప్పితే..కార్యాలయాలు, అధికారుల నియామకం చేపట్టలేదు. ఆదిలాబాద్ జిల్లాలో సొనాల, సాత్నాల, భోరజ్ మండలాలను ఏర్పాటుచేస్తూ ఆరు నెలల క్రితం గెజిట్ విడుదల చేసింది. కానీ కార్యాలయాల ఏర్పాటు, అధికారుల నియామకంలో మాత్రం ఎలాంటి ముందడుగు పడలేదు. అంతలోనే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగడం..ప్రభుత్వం మారిపోవడం జరిగిపోయింది. ఆయా కొత్త మండలాలకు సంబంధించి ప్రజల్లో అయోమయం నెలకొంది. అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కొత్త సర్కారు అమలుచేస్తుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండలాల ఏర్పాటులో తాజా ప్రభుత్వం తీసుకొనే నిర్ణయంపైనే అందరి దృష్టి కేంద్రీకృతమవుతోంది.


మండలంగా ఏర్పాటు కానున్న సొనాల గ్రామం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లాలో మూడు కొత్త మండలాలను ఏర్పాటుచేస్తూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో ఇది వరకు 18మండలాలు ఉండగా కొత్తగా మూడు ఏర్పాటుతో వీటి సంఖ్య 21కి చేరింది. ప్రభుత్వం 2023 ఆగస్టులో సాత్నాల, భోరజ్ మండలాలు ఏర్పాటుచేస్తూ అధికారికంగా గెజిట్ విడుదల చేసింది. సొనాల మండలాన్ని మాత్రం అంతకు కొన్ని రోజుల ముందే ఏర్పాటుచేస్తూ నిర్ణయం తీసుకుంది. జిల్లాలోనే పెద్ద మండలంగా ఉన్న జైనథ్ మండలంలోని 28 గ్రామాలను విభజించి కొత్తగా భోరజ్ కేంద్రంగా మండలాన్ని ఏర్పాటుచేసింది. మరోపక్క జైనథ్ నుంచి 7 గ్రామాలు, బేల మండలం నుంచి మరో 7 గ్రామాలు, ఆదిలాబాద్ రూరల్ మండలం నుంచి నాలుగు గ్రామాలను విడదీసి సాత్నాల కేంద్రంగా 18 గ్రామ పంచాయతీలతో కొత్త మండలం ఏర్పాటుచేస్తూ గెజిట్ విడుదల చేసింది. వీటి కంటే నెల రోజుల ముందుగానే బోథ్ మండలంలోని 12 గ్రామ పంచాయతీలను విభజించి కొత్తగా సొనాల మండలం ఏర్పాటుచేసింది. ఈ మండలం ఏర్పాటుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు సాధన సమితిగా ఏర్పడి సుమారు 84రోజుల పాటు ఉద్యమాన్ని చేపట్టారు. దిగివచ్చిన ప్రభుత్వం సొనాలను మండలంగా ప్రకటించింది.

కార్యాలయాల ఏర్పాటులో జాప్యం

కొత్త మండలాలు ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంతో ఆయా గ్రామాల ప్రజలు సంబరపడ్డారు. మండల కేంద్రానికి వెళ్లే దూరభారం తప్పడంతో పాటు అధికారిక పనులు త్వరగా జరుగుతాయని ఆనందం వ్యక్తం చేశారు. వీటితో పాటు కొత్తగా అధికారులు అందుబాటులోకి రావడంతో పాటు రాజకీయంగానూ కొత్త పదవులు వస్తాయని భావించారు. కానీ అధికారులు మాత్రం వీటిలో కొత్త కార్యాలయాలు ఏర్పాటుచేయడంలో తీవ్ర జాప్యం చేశారు. ఒకటి, రెండు సార్లు ఆయా ప్రాంతాలకు వెళ్లిన అధికారులు కొన్ని అనువైన కార్యాలయాలు పరిశీలించి..అవసరమైన మ్యాప్‌ను తయారుచేశారు. కానీ వాటి ఏర్పాటులో మాత్రం త్వరగా నిర్ణయం తీసుకోలేదు. మరోపక్క తహసీల్దార్, ఎంపీడీఓతో పాటు ఇతర విభాగాలకు అధికారులను కూడా నియమించలేదు. మరోపక్క డిసెంబర్‌లో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో అంతకుముందు నుంచే అధికారులు ఎన్నికల నిర్వహణలో తలమునకలై ఉండిపోయారు. దీంతో కొత్త మండలాల్లో మౌళిక సదుపాయాలను ఏర్పాటుచేయలేకపోవడంతో ప్రస్తుతం వాటి పరిస్థితిలో ఎలాంటి ముందడుగు పడటం లేదు.



ఏర్పాటుపై అయోమయం..?

కొత్త మండలాల ఏర్పాటైందని సంతోషపడిన జనాలకు ఆయా మండలాల ప్రక్రియ ముందుకు సాగకపోవడం తీవ్ర అసంతృప్తికి గురిచేస్తోంది. కొత్త ప్రభుత్వం కొలువు దీరి నెల రోజులు గడుస్తున్నా.. మండలాల్లో మౌళిక సదుపాయాల ఏర్పాటుపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. మరోపక్క అప్పటి ప్రభుత్వం చేపట్టిన కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటి ఏర్పాటులో సరైన విధానం పాటించలేదని..ఇష్టారీతిన చేపట్టారని వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. దీంతో వీటి ఏర్పాటులో అయోమయం నెలకొంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం పాత గెజిట్ ప్రకారమే మండలాలను ఏర్పాటుచేస్తుందా.. ఏమైనా మార్పులు చేర్పులు చేస్తుందా అనే దానిపై సందిగ్ధం నెలకొంది.

విద్యార్థులు లక్ష్య సాధన దిశగా సాగాలి

- ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

విద్యార్థులు లక్ష్య సాధనగా దిశగా సాగి ఉద్యోగాలు సాధించాలని అనసూయ పవర్ ట్రస్ట్ చైర్మన్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. అనసూయ పవర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఎస్‌స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత కోచింగ్ ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ఏడు సంవత్సరాలుగా కోచింగ్ నిర్వహిస్తున్నామని, యువకులు ఉద్యోగాలు సాధించడం శుభ పరిణామమని అన్నారు. ఇంట్లో ఒకరికి ఉద్యోగం వస్తే ఆ కుటుంబం బాగుపడుతుందని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని, స్టడీ మెటీరియల్ అందజేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఇరిగేషన్ అభివృద్ధి చెందడమే తన ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా గతంలో కానిస్టేబుల్, పంచాయతీ కార్యదర్శి, ఎస్సైలుగా ఉద్యోగాలు సాధించిన 20 మంది ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ఎమ్మెల్యేకుజ్ఞాపికను అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బి గంగాధర్, బిజెపి నాయకులు నారాయణరెడ్డి, సౌంలి రమేష్, తుమ్మోల్ల దత్తాత్రి, పిఎసిఎస్ డైరెక్టర్ వడ్నప్ శ్రీనివాస్, మండల విద్యాధికారి సుభాష్, కుభీర్, లోకేశ్వర్ మండల విద్యాధికారులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు రమణారావు, కోచింగ్ సెంటర్ అధ్యాపకులు శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.


పాల్గొన్న విద్యార్థులు

కళ్యాణిఖని ఓపెన్‌కాస్ట్‌తో తీవ్ర ఇబ్బందులు



నవతెలంగాణ - కాసిపేట

సింగరేణి కళ్యాణిఖని ఓపెన్ కాస్ట్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని సోమగూడెం(కె) ఉప సర్పంచ్ కనుకుల రాకేష్ మండిపడ్డారు. సోమవారం మండలంలోని సోమగూడెం(కె) గ్రామ పంచాయతీలో ఉప సర్పంచ్ కనుకుల రాకేష్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే వార్షిక సంవత్సర ప్రణాళికను రూపొందించారు. గ్రామ సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాల కోసం చర్చించుకున్నారు. అనంతరం ఉప సర్పంచ్ కనుకుల రాకేష్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో అందరం కలిసి కట్టుగా గ్రామ అభివృద్ధికి కృషి చేశామని, అలాగే రాబోయే రోజుల్లో కూడా ఊరి అభివృద్ధి కోసం పాటు పడాలన్నారు. సోమగూడెం గ్రామం పక్కనే కేకే ఓసీ అధికారులు పెద్ద బోర్ వేశారని, దానివల్ల గ్రౌండ్ వాటర్ పడిపోయే అవకాశం ఉందని తెలిపారు. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలన్నారు. ఓపెన్ కాస్ట్‌లో పేలుళ్ల వల్ల ఇండ్లు దెబ్బతింటున్నాయని, ఎప్పుడు కూలిపోతాయో అని భయభ్రాంతులతో ఉండాల్సి వస్తుందన్నారు. ఓసీతో ఇంత నష్టపోతున్నా ఇప్పటి వరకు ఒకరికి కూడా ఉద్యోగం ఇవ్వలేదని, గ్రామంలో అభివృద్ధి పని కూడా చేయలేదని పేర్కొన్నారు. హక్కుల కోసం, గ్రామ అభివృద్ధి కోసం పోరాడాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కీర్తి, వార్డ్ మెంబర్లు సపాట మల్లేష్, మల్యాల స్రవంతి, బూడిద రోజా, వివిధ శాఖల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏఎన్‌సీ క్లినిక్ డే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఏఎన్‌సీ క్లినిక్ డే సందర్భంగా సోమవారం రక్త, మూత్ర పరీక్షలు జరిపినట్టు డా.సర్ఫరాజ్ తెలిపారు. మావల, దస్నాపూర్, రామాయి గ్రామాలకు చెందిన వారికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బి.సుభాష్, స్టాఫ్ నర్స్‌లు ద్రుపత, గంగామణి, నాగరాణి, ఇర్ఫాన్ పలువురు ఆశాలు పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన గత ప్రభుత్వం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి కొత్త ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇండ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని, అన్నివిధాలుగా న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఇంటి స్థలాల కోసం, డబుల్ బెడ్ రూం ఇండ్లకోసం తమ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టినప్పటికీ ఆనాటి పాలకులు, అధికారులు పెడచెవిన పెట్టారని తెలిపారు. సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేస్తుందన్న నమ్మకం తమకు ఉందన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పేదల పక్షాన ఆందోళన చేపట్టామని తెలిపారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.



ఉత్పత్తి, రక్షణలో ముందుంటారు : జీఎం సంజీవరెడ్డి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఉపరితల గని ఉద్యోగులు ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణలో ముందుంటారని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఉపరితల గనిలో కొత్త లోడర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ఉద్యోగులు మంచి పారిశ్రామిక సంబంధాలు కలిగి ఉంటారన్నారు. ఉపరితల గనికి కావాల్సిన అంతర సామాగ్రిని ఎప్పటికప్పుడు సమకూర్చడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ లోడర్ 6.4ఎం కేపాసిటి, 530 హెచ్‌పి సామర్థ్యం గలదని, దీని విలువ రూ.5.30కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ పురుషోత్తంరెడ్డి, గుర్తింపు సంఘం నాయకులు, ఎస్ఆర్పీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి మేనేజర్ శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి నల్లపు సత్తయ్య, ప్రాజెక్ట్ ఇంజనీర్ ఎంవీఎస్‌ఏ చంద్రశేఖర్, ఇంజనీర్ శ్యాంసుందర్‌రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ బి.శంకర్, ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అన్నదానం కార్యక్రమాలు

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని అన్ని గ్రామాల్లో అయోధ్య శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా సోమవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. మండలంలోని సంజీవనగర్ కోదండ రామాలయంలో మహిళలు శ్రీరామ పాదుక పూజా, విష్ణుసహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పల్లకి సేవ, దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఆదిలాబాద్‌టౌన్ : అయోధ్య బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట మహాఘట్టం సందర్భంగా పట్టణంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణమఠంలో సోమవారం సంప్రదాయ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అశేషంగా తరలి వచ్చిన జనవాహిణి నడుమ శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రముఖులు హాజరై స్వామివారి సేవలో పాల్గొన్నారు. ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో భక్తుల కోసం మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రాణప్రతిష్ట క్రతువును తిలకించేందుకు బిగ్ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. చిన్నారులు వేసిన రాముడు, సీత, లక్ష్మణుడు, శబరి వేషధారణలు ఆకట్టుకున్నాయి.

మత సామరస్యాన్ని చాటిన ఎస్పీ

పట్టణంలోని గోపాలకృష్ణ మఠంలో శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది.


ఆదిలాబాద్‌టౌన్ : కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ, ఎమ్మెల్యే శంకర్

అయోధ్యలో విగ్రహ ప్రతిష్టపణ కార్యక్రమాన్ని భక్తులు చూసేందుకు ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. సోమవారం నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎస్పీ గౌస్ ఆలం, కృష్ణానంద గురూజీ భక్తులతో కలిసి స్క్రీన్‌లో వీక్షించారు. ఈ వేడుకల్లో ఎస్పీ మతసామరస్యాన్ని చాటారు. నుదుట బొట్టు పెట్టుకొని చేతికి కంకణం కట్టుకొని మత సామరస్యాన్ని చాటారు.

దిలావర్‌పూర్ : మండల కేంద్రంలోని శీరామ మందిరంలో వైభవోపేతంగా సీతారాముల పూజా కార్యక్రమం జరిగింది. పండితులు శంకర్ శర్మ, సకరాం శర్మ, సంజయ్ శర్మ ప్రదీప్ శర్మ, వేద మంత్రాలతో ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సీతా రాములను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. పూజా కార్యక్రమం నిర్వహిస్తుండగా విజేత స్కూల్ విద్యార్థులు రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు, లవకుశుల వేషాధారణలో రామ మందిరానికి విచ్చేయడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు చేసిన నృత్యాలు భక్తులను ఆకట్టుకుంది. ఎంఎల్‌ఏ మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దిలావర్‌పూర్ గ్రామం నుండి అయోధ్యకు బయలుదేరి రామ రథ యాత్ర, జ్యోతి యాత్రలో పాల్గొన్న సభ్యులు సంబు భోజారాం పటేల్, కదం గంగాధర్ పటేల్, కట్కం రాజేందర్‌రెడ్డి, సట్టి పీరాజీలను ఎంఎల్‌ఏ మహేశ్వర్‌రెడ్డి, విడిసి సభ్యులు ఘనంగా సన్మానించారు. దాతల సహకారంతో అన్నదానం చేపట్టారు.

ఆదిలాబాద్ రూరల్ : మావల మండల కేంద్రంతో పాటు బట్టిసావర్గం, వాఘాపూర్ గ్రామాల్లో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. వాఘాపూర్ గ్రామంలో శ్రీమురళీ కృష్ణ ఆలయం నుండి గ్రామస్తులు రాముని ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. అనంతరం అన్నదానం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ మడావి మయూరి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, గ్రామ పెద్ద చిల్కూరి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


దిలావర్‌పూర్ : పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | జనవరి 23, 2024 | www.navatelangana.com

ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓగా ఖుష్బు గుప్తా



నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ ఇన్‌చార్జీ పీఓగా ఖుష్బు గుప్తా సోమవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో శాఖల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని ప్రతి ఒక సమస్యలను పరిష్కారమయ్యే విధంగా చూస్తానని తెలిపారు. అధికారులు ఎలాంటి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు ఉన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఉట్నూర్





చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పాత ఉట్నూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పాత ఉట్నూర్‌కు చెందిన డి.రామకృష్ణ(35) గత రెండు రోజులుగా కనబడకుండా పోయాడు. మత్తు మధ్యంలో గంగన్నపేట చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, విచారణ జరిపి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆలయాల్లో భక్తుల సందడి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అయోధ్య రామ మందిరంలో బాల రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆదిలాబాద్ రూరల్ మావల మండలంలోని రామాయి, భీంసరి, యాపల్‌గూడ ఆయా గ్రామాల్లో సోమవారం రాములోరి పల్లకి ఊరేగింపు వైభవంగా చేపట్టారు. ముందుగా గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గంద్రత్ రమేష్ మాట్లాడారు. గ్రామంలో పలు వీధుల గుండా శ్రీ రాముని శోభాయాత్ర నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామస్తులందరూ శోభయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెందూర్ గంగారాం, ఉపసర్పంచ్ జయంత్, రోషన్ భూమన్న, కాంతారావు, జైరాం, అరిగెల కిష్టయ్య, ఆయా గ్రామాల సర్పంచులు మయూరిచంద్ర. ఎంపీటీసీలు మహిళలు,పాల్గొన్నారు.

ఉట్నూర్ : అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిస్టాపన మహోత్సవాన్ని పురస్కరించుకొని ఉట్నూర్ మండల కేంద్రంలోని శ్రీరామాలయంలో సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అదేవిధంగా జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ లక్కారం గ్రామంలోని అభయాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హనుమాన్ మందిర్ నుంచి రామ్ మందిరం వరకు పల్లకితో శోభా యాత్రగా బయలు దేరారు. శోభా యాత్రను బీజేపీ నాయకులు, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నార్నూర్ : అయోధ్యలో రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా సోమవారం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్, గుంజాల, ఖంపూర్ తదితర గ్రామాల్లో సంస్కృతి సాంప్రదాయబద్ధంగా మహిళలు, యువకులు నృత్యాలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. దీనితో గ్రామాల్లో రామ నామస్మరణతో మారుమోగింది. ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : మండలంలోని పీచార గ్రామానికి చెందిన గడ్‌చాంద శంకర్ అయోధ్య రామ మందిర ప్రతిష్టపన సందర్భంగా సోమవారం రామాలయం వద్ద వేసిన చిత్రం పలువురిని అబ్బురపరచింది. తన చిత్రంతో రామభిమానం చాటుకున్న తీరును చూసి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

తాంసి : రామ జన్మభూమి అయోధ్యలో సోమవారం బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన సందర్భంగా తాంసి, భీంపూర్ మండల కేంద్రాలలో పాటు అన్ని గ్రామాల్లో అన్ని ఆలయాలను సర్వాంగ సుందరంగా, రంగు రంగుల ముగ్గులు విద్యుత్ దీపాలు పూలతో అలంకరించి, ఉదయం నుంచి గ్రామస్తులు ఆలయాలకు చేరుకొని, ప్రత్యేక పూజలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, హిందూ యువసేన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన టీపీసీసీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు



నవతెలంగాణ-ఇచ్చోడ

రాష్ట్ర పంచాయతీరాజ్, శిశుసంక్షేమ శాఖ మంత్రి, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ అనసూయ సీతక్కను హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయంలో సోమవారం ఇచ్చోడ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, టీపీసీసీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు కుమురం కొటేష్ మర్యాదపూర్వకంగా కలిసి గిరిజనుల, ఇచ్చోడ మండల ప్రజల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు షాదుల్లా, గంగారాం పాల్గొన్నారు.

ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని 25న బైక్ ర్యాలీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఈనెల 25వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా క్రీడా సంఘాల బాధ్యులు, క్రీడా పోషకులు, క్రీడా ప్రేమికులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గిరిజన గురుకుల విద్యార్థుల ప్రతిభ




నవతెలంగాణ-ఇచ్చోడ

ఇంటర్ సొసైటీ లీగ్ రాష్ట్రస్థాయి క్రీడల్లో ఇచ్చోడ గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు అర్చన 9వ తరగతి, బాక్సింగ్‌లో సిల్వర్ మెడల్, వైష్ణవి 10వ తరగతి 400మీటర్ రన్నింగ్‌లో కాంస్య మెడల్ సాధించారు. పాఠశాలకు వచ్చిన క్రీడాకారులకు ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రిన్సిపాల్ రత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ కాంతారావులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలలో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశ్విని, లక్ష్మీ గంగామణి, లత పాల్గొన్నారు.

భైంసా ఏరియాస్పత్రిని ఆధునీకరిస్తాం

నవతెలంగాణ-భైంసా

భైంసా ఏరియా ఆసుపత్రిని ఆధునికరించి పేద ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. సోమవారం ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసి ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. అవుట్ పేషెంట్లకు వెయిటింగ్ రూమ్‌లు, ఓపి పేషంట్ కోసం విధులు నిర్వర్తించే డాక్టర్లకు ప్రత్యేక గదులు, కావలసిన సౌకర్యాలు ఇతర అంశాలపై అధికారులతో చర్చించారు. ఆసుపత్రిలో రోగులకు ఇబ్బందులు కాకుండా ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా ఏరియా ఆసుపత్రిని ఆధునికరించేందుకు చర్యలు చేపట్టారు. ఇంజనీరింగ్ అధికారులతో ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. అన్ని వార్డులు తిరుగుతూ కావలసిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఎమర్జెన్సీ వార్డుతో పాటు చిన్నపిల్లల వార్డులను పరిశీలించి కావలసిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ప్రాంతమంతా తిరుగుతూ పార్కింగ్ సమస్యలు, ఇతరత్న విషయాలపై డాక్టర్లతో చర్చించారు. ఎమ్మెల్యే పదవి బాధ్యతలు చేపట్టాక నెలలోనే మూడుసార్లు ఆయన ఆసుపత్రికి వచ్చారు. పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని, ఆసుపత్రిని అన్ని హంగులతో తీర్చిదిద్దామన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ బి గంగాధర్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కాశీనాథ్, డాక్టర్ అనిల్‌కుమార్ ఉన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు

నవతెలంగాణ-నిర్మల్

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ వార్షిక, ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ వార్షిక, ప్రాక్టికల్ పరీక్షలు వచ్చేనెల ఫిబ్రవరి 1వ తేది నుంచి 15వ తేదీ వరకు, (రెండవ శనివారం, ఆదివారాలు పరీక్షలు) ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించబడతాయని అన్నారు. వార్షిక పరీక్షలు ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఫిబ్రవరి 28 నుంచి మార్చ్ 18 వరకు, ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఫిబ్రవరి 29 నుంచి మార్చ్ 19 వరకు 2023-24 విద్యా సంవత్సరంలో చేరిన ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష ఫిబ్రవరి 16వ తేదిన నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష ఫిబ్రవరి 17న ఉదయం 10 నుంచి 1 గంటల వరకు, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఫిబ్రవరి 19న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మొత్తం 38 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా నిరంతరం విద్యుత్ సౌకర్యం కల్పించాలని, తాగునీరు, వైద్య సిబ్బంది, ఫర్నీచర్, తదితర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు హాజరయ్యేలా బస్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి పరుశురాం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షిద్దాం.. చదివిద్దాం

ఆడపిల్లలను రక్షిద్దాం.. ఆడపిల్లను చదివిద్దామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం నేషనల్ గర్ల్ చైల్డ్ డేను పురస్కరించుకొని మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జనవరి 19 నుంచి జనవరి 24 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, వివిధ విభాగాలకు చెందిన జిల్లా అధికారులు, అందరి సంతకాలను సేకరించారు. జిల్లా కలెక్టర్ అధికారులతో భేటీ బచావో, భేటి పడావో, ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలను చదివిద్దాం అనే ప్రతిజ్ఞ చేయించారు.

రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలి

- ఎస్ఎస్‌డీ నేషనల్ ఆర్గనైజర్ సునీల్ సారిపుత్త



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగంపై ప్రతీ పౌరుడికి అవగాహన కల్పించి, రాజ్యాంగ గ్రంథాలను ఉచితంగా అందజేయాలని ఎస్ఎస్‌డీ నేషనల్ ఆర్గనైజర్ సునీల్ సారిపుత్త అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్ బుద్ధ విహార్‌లో జరుగుతున్న ఎస్ఎస్‌డీ నేషనల్ రిపబ్లిక్ క్యాంప్ శ్రామనీర్, సైనికులను పిప్పల్‌ధరి గ్రామస్తులు తమ గ్రామానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ఎస్ఎస్‌డీ సైనికులను ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామ ప్రధాన వీధుల గుండా శోభయాత్ర నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధుడు, అంబేద్కర్, రాజ్యాంగం గురించి వక్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ భారత సంఘటకులు మార్షల్ దీపక్ వాగ్మారే, పూజ్య బంతే బుద్ధఘోష్, జిల్లా సంఘటకులు శీలానంద్ కామ్రే, రామకాంత్ కామ్రే, బుద్ధ విహార్ కమిటి అధ్యక్షులు గజానన్ తాక్‌సాండే, సభ్యులు గులే మోహన్, పిప్పల్‌ధరి మండల సాధన కమిటి అధ్యక్షులు తెలంగ్ బాపురావు, సలహాదారులు మునేశ్వర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



రాష్ట్ర ప్రథమ మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రథమ మహాసభలను జనవరి 28న వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని ఈ రాష్ట్ర ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహాసభలకు సంబంధించిన గోడప్రతులను సోమవారం కుమురంభీం భవన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా జగన్‌సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది మొత్తాన్ని వెంటనే పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జీఓ నెంబర్ 50ను రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మోటార్ రంగంలో పనిచేస్తున్న కార్మిక వర్గానికి భీమా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా రాష్ట్రంలో ప్రమాదం, అనారోగ్యం వల్ల వందల మంది చనిపోయిన గ్రామపంచాయతీ వర్కర్లకు నేటికీ బీమా అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. వెంటనే సహజ మరణానికి రూ.5లక్షలు, ప్రమాద మరణానికి రూ.10లక్షల బీమా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గ్రామపంచాయతీ వర్కర్స్ గత పది సంవత్సరాలుగా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నితిన్, అజ్మీర వినోద్, వెంకట్, సురేష్, పటేల్, బుచ్చిరాం, ఆత్రం వినోద్ పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న 13మందిపై కేసు నమోదు

- రూ.39 వేలు స్వాధీనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేకాట స్థావరాలపై ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలో ఫిష్ మార్కెట్ వద్ద పేకాట ఆడుతున్న 13 మందిని పట్టుకొని కేసులు నమోదు చేసినట్టు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఎస్సై అబీబ్‌ఖాన్ పేకాట ఆడుతున్న వారి నుంచి రూ.39 వేల నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు సీఐ వివరించారు.

సంఘం అభివృద్ధికి కృషి చేయాలి



నవతెలంగాణ-తలమడుగు

నూతనంగా ఎన్నికైన మాల సంక్షేమ సంఘం సభ్యులను తమ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. సోమవారం రుయ్యాడి గ్రామ మాల సంక్షేమ సంఘ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ యువకులకు సంఘంలో చోటు కల్పించడం అభినందనీయమని అన్నారు. కష్టపడి పనిచేసి కుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. తన వంతు సహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నూతన అధ్యక్షుడు ఉడుగు అఖిలేష్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షుడు మహేందర్, కోశాధికారి నక్క వేణు, కార్యదర్శులు రాకేష్, కిరణ్ సంఘ నాయకులు బిట్ల చైతన్య లస్మన్న, చిన్న గంగన్న, రావుల గంగన్న పాల్గొన్నారు.

పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేయాలి



నవతెలంగాణ-కాసిపేట


కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల కృష్ణ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కోమటిచేను గ్రామ పార్టీ సీనియర్ నాయకులు జాడి శంకరయ్య నివాసంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా యువజన మండల సోషల్ మీడియా ఇన్‌చార్జిగా దుర్గం గణేష్, యువజన గ్రామ అధ్యక్షుడిగా కుమ్మరి సురేష్‌ను నియమించి నియామక పత్రాలను యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనుకుల రాకేష్‌తో కలిసి మండల అధ్యక్షులు వేముల కృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షురాలు కోక్కిరాల సురేఖ నాయకత్వంలో పని చేసి గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన దుర్గం గణేష్, కుమ్మరి సురేష్ మాట్లాడుతూ తమకు ఈ అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షురాలు సురేఖ, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వినోద్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సంపత్‌రెడ్డి, అసెంబ్లీ అధ్యక్షులు మహేందర్, మండల అధ్యక్షులు వేముల కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాసు సుధాకర్, కొడప అనంతరావు, వెంకటేష్, శ్రీనివాస్, వేణు, ప్రసాద్, జక్కులు, రాంచందర్, వినయ్, శివ ప్రసాద్, సంతోష్, ప్రేంకుమార్, విజయ్ పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. భూసంబంధ, ఆసరా, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, తదితర సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. శాఖల వారిగా వచ్చిన ప్రజావాణి దరఖాస్తులపై సమీక్షిస్తూ క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అర్జీదారులకు రాతపూర్వకంగా సమాధానం అందించాలని సూచించారు. అనంతరం జిల్లా షెడ్యూల్డు కులాల ప్రత్యేక అభివృద్ధి నిధుల అమలుపై నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలు ప్రతి సంవత్సరం 16శాతం ఎస్సీల సంక్షేమానికి నిధులు వినియోగించాలని సూచించారు. అలాగే జనవరి 23న మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క జిల్లా పర్యటన నేపథ్యంలో జిల్లా అధికారులు ఆయా శాఖల సంక్షిప్త నివేదికలతో ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ స్రవంతి, ఎస్సీ సంక్షేమ అధికారిణి సునీత కుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

త్వరలో కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మామడ మండలంలోని కొరిటికల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్ల లింగారెడ్డి, కొటికల్ ఎంపీటీసీ సౌజన్య రాజేశ్వర్ బీఆర్ఎస్‌కి సోమవారం రాజీనామా చేశారు. నిర్మల్ డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు ఆధ్వర్యంలో బుధవారం 200 మందితో చేరనున్నట్టు తెలిపారు. సోమవారం శ్రీహరిరావును మర్యాదపూర్వకంగా కలిసి కాంగ్రెస్ పార్టీ కొరకు పని చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ త్వరలో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు ఉంటాయని పేర్కొన్నారు.

3

నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక

కుమురంభీం ఆసిఫాబాద్

మంగళవారం | జనవరి 23, 2023 | www.navatelangana.com

కేతేశ్వర స్వామి, కంకాలమ్మ జాతర పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీ పరిధిలోని వీర్లగుట్టపై వెలిసిన శ్రీ కేతేశ్వర స్వామి, కంకాలమ్మ జాతర పోస్టర్లను బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుక్య జాన్సన్ నాయక్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేతేశ్వర స్వామి కంకాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఈ నెల 28 నిర్వహించనున్న జాతరకు రావాలని జాన్సన్ నాయక్‌ను ఆహ్వానించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ నిర్వాహకులకు జాన్సన్ నాయక్ సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎంఆర్ నరసింహారావు, చిలువేరు నరసయ్య, కోడి జుట్టు రాజన్న, అశోక్, అంజన్న, మల్లయ్య పాల్గొన్నారు.

పూలే విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కేజీగూడ గ్రామంలో సోమవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి జ్యోతిబాపూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామంలో ప్రజల కోరిక మేరకు విగ్రహాలను ఏర్పాటుచేయడాని తనవంతు సహకరిస్తానని ఆమె అన్నారు. ఆమెతో పాటు సరండి సర్పంచ్ దుర్గం కమలాకర్, సింగిల్‌విండో చైర్మన్ జాబిరె పెంటు పాల్గొన్నారు.



జాతీయ ఓటరు, గణతంత్ర దినోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

● ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 25వ తేదీన జరగనున్న 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని, గణతంత్ర దినోత్సవాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ ఆర్డీఓలు కాసబోయిన సురేష్, కదం సురేష్, కాగజ్ నగర్ డీఎస్పీ కరుణాకర్‌తో కలిసి జాతీయ ఓటరు దినోత్సవం, గణతంత్ర దినోత్సవ సన్నాహక ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా జిల్లా కేంద్రం, నియోజకవర్గ కేంద్రం, మండల కేంద్రాలలో, పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటు యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా ర్యాలీలు నిర్వహించి ఓటరు ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు. 25న ఉదయం 10గంటలకు కలెక్టరేట్ భవనం నుండి ర్యాలీ ప్రారంభించి అంబేద్కర్‌చౌక్ మీదుగా తిరిగి కలెక్టరేట్‌కు రావడం జరుగుతుందని, వయోవృద్ధులు, దివ్యాంగులు, నూతనంగా ఓటరు నమోదు చేసుకున్న వారిని సత్కరించడం జరుగుతుందని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో విధులు నిర్వహించే అధికారులు తమ ఓటరు గుర్తింపు కార్డుతో పాటు ఇతర వివరాలను అందించాలని, పోస్టల్ బ్యాలెట్ కొరకు పూర్తి వివరాలు అందజేయాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటు ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా బ్యానర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ నెల 26వ తేదీన జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా కలెక్టరేట్ భవన ఆవరణలో పోలీసు గౌరవ వందనం, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన అనంతరం జిల్లా కేంద్రంలోని ఏఆర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఇతర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వేడుకలలో భాగంగా తాగునీరు, షామియానాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అవసరమైన చర్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదలకు కేంద్ర పథకాలు అందాలి

● కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

నిరుపేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందాలనేదే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్ష్యమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో సోమవారం వికసిత భారత్ ఎల్ఈడి స్క్రీన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో వీధి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తూ పేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని తెలిపారు. రుణాలు సక్రమంగా చెల్లించిన వీధి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రెట్టింపు రుణాలు ఇస్తున్నాయన్నారు. వీధి వ్యాపారులు లబ్ధిపొందిన తీరును ఈ సందర్భంగా లబ్ధిదారులు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఎల్ఈడి స్క్రీన్ ద్వారా ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా క్యాలెండర్లను, వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పాటల రూపంలో పాడి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ భార్గవ్, డిఎస్ఓ, ఎస్బిఐ మేనేజర్ వినయ్‌చంద్ర, పిఆర్‌పి సునీత, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, వీధి వ్యాపారులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ఫారం 6 పై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫారం 6పై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రవీణ్ కుమార్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జాతీయ ఓటర్ డేను పురస్కరించుకుని కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పేర్కొన్నారు. చరిత్ర అధ్యాపకులు అసిస్టెంట్ ప్రొఫెసర్ జయప్రకాశ్ మాట్లాడుతూ ఓటు అనేది భవిష్యత్తు సమాజానికి నిర్మాణం చేసే ఆయుధమని విద్యార్థులకు సూచించారు. ఓటును సరియైన విధానంలో ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల జాతీయ సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించినట్టు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో హిస్టరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ జయప్రకాశ్, కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.నాగనిక, కెమిస్ట్రీ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ బుద్దె అరుణ్‌కుమార్, జాతీయ సేవా సమితి ప్రోగ్రాం ఆఫీసర్స్ కృష్ణ ప్రసాద్, గోదావరి, అధ్యాపకులు గంగారెడ్డి, సిద్ధురాజు, వినయ్‌కుమార్, గోదావరి, రాణి, సంగీత, సురేష్‌రెడ్డి, మోహిన్, రామకృష్ణ, రవి కిరణ్, అలీ చౌస్, కళాశాల సూపరింటెండెంట్ వసంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అక్షింతలు పంపిణీ

నవతెలంగాణ-సదాశివనగర్/మద్నూర్

మండలంలోని వజ్జేపల్లి తండాల్లో అయోధ్య అక్షింతల ఊరేగింపును సోమవారం శోభాయమానంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాండలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి భాజాభజంత్రీలు, భజనలు, భక్తి సంకీర్తనలు ఆలపిస్తూ మంగళ హారతులతో తండాల్లో అక్షింతలను ఊరేగించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అక్షింతలు, కరపత్రం, జెండాను అందజేశారు. రామమందిర ప్రాణప్రతిష్ట సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిల్ కుమార్, ఉప సర్పంచ్ స్రవంతి, నాయకులు మంగ్యానాయక్, సర్దార్ నాయక్, లచ్చిరామ్ నాయక్, శంకర్ నాయక్, సరిచంద్, బలిరామ్ నాయక్, చంద్రునాయక్, ధూమా, మోతీరాం, వెంకట్‌రామ్, గంగారాం, మోహన్, హరీ, సంతోష్, లక్ష్మణ్, రవి తండా ప్రజలు పాల్గొన్నారు.

మాచారెడ్డి : మండలంలోని లక్ష్మి రావులపల్లి గ్రామంలో సోమవారం అయోధ్యలో శ్రీరామ మందిర ప్రాణ ప్రతిష్ట సందర్భంగా గ్రామంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం సన్నిధిలో పాలాభిషేకం, పంచామృతాభిషేకం స్వామివారికి చందన పూజ జరిపి అనంతరం శ్రీరాముల విగ్రహాలను రామాంజనేయ యువజన సభ్యులు గ్రామంలో వీధివీధినా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● టీఎంఈయూ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ శ్రీనివాసచారి



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులతో శ్రీనివాసచారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో పనిచేస్తున్న మెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస చారి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రాజు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీహెచ్‌సీలో నిర్వహించిన నూతన కమిటీ ఎన్నిక సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఉద్యోగులకు ప్రమోషన్ ఇవ్వాలని, ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలని, హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని, పెండింగులో ఉన్న 18 నెలల డీఎను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖాళీలని వెంటనే భర్తీ చేయాలని అన్నారు. జీఓ నెంబర్ 317ను సవరించాలని, పీఆర్సీ ఏరియార్స్ ఇవ్వాలన్నారు. పెండింగులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైద్య శాఖ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు టి.దివాకర్, ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, కార్యదర్శి మల్లేష్, నాయకులు విజయ్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీ జిల్లా గౌరవాధ్యక్షులు బోగే ఉపేందర్, అధ్యక్షులుగా సరోజ, ఉపాధ్యక్షులుగా సుజాత, సుష్మా ప్రధాన కార్యదర్శి రేణు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా పద్మ, కోశాధికారిగా ఫ్లోరెన్సీ, ముఖ్య సలహాదారులుగా వందన, వేరునిక ఎంపికయ్యారు.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

● మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్‌లు బి.రాహుల్, సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓలు వి.రాములు, హరికృష్ణతో కలిసి వివిధ శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవ వేడుకల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. వేడుకలలో ప్రభుత్వ శాఖల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన విజయాలతో ప్రజలకు తెలిసే విధంగా స్టాళ్ళను ఏర్పాటు చేయాలని తెలిపారు. వేడుకలకు వచ్చే ప్రజల సౌకర్యార్థం సదుపాయాలు కల్పించాలని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ శాఖల నుంచి అత్యున్నత సేవలు అందిస్తున్న వారితో పాటు వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల పురోగతిని తెలియజేస్తూ ప్రగతి నివేదిక సిద్ధం చేయాలని, శాఖల వారిగా శకటాల ప్రదర్శన ఏర్పాట్లు చేయాలని సూచించారు. దేశభక్తిని తెలిపే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించాలని అధికారులకు సూచించారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల సమన్వయంతో జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో వేడుకలలో భాగంగా పరేడ్ గ్రౌండ్ సిద్ధం చేయాలని, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రొటోకాల్ ప్రకారం కుర్చీలు, టెంట్లు, షామియానాలు, మైక్, స్పీకర్లు ఏర్పాటు చేయాలని, మంచిర్యాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, జిల్లా విద్య, ఇంటర్మీడియట్ విద్య, గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రసంగ ప్రతి సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సంయుక్తంగా ప్రశంసా పత్రాలు అందించేందుకు ఉత్తమ సేవలు అందించిన వారి జాబితాను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర రహదారులపై స్పందించిన అధికారులు

● ప్రధాన రహదారి మూసివేత

● సంఘటన స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



ప్రమాద స్థలం వద్ద దారి మళ్లించిన అధికారులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై జిల్లా అధికారులు వేగంగా స్పందించారు. కలెక్టర్ బొర్కాడే హేమంత్, ఎస్పీ సురేష్ కుమార్ ఆదివారం సంఘటన జరిగిన ప్రధాన రహదారిని పరిశీలించారు. ఆసిఫాబాద్ పట్టణం నుంచి నేషనల్ హైవేపైకి వెళ్లే రహదారి సరిగ్గా లేదని దీనిని మూసివేయడం జరుగుతుందని తెలిపారు. దీనిలో భాగంగా స్థానిక పోలీస్ అధికారులను రహదారి మూసివేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి శాశ్వత ప్రాతిపదికన పట్టణ నుంచి హైవేకు వెళ్లే రహదారి మూసివేయనున్నట్లు, హైవే నుంచి పట్టణంలోకి వచ్చే రహదారి అలాగే కొనసాగనున్నట్లు తెలిపారు. తాత్కాలిక ప్రాతిపదికన సోమవారం సాయంత్రం పట్టణం నుంచి హైవేకి వెళ్లే రహదారి మూసివేసి వాహనాలను గుండి రహదారిపై ఉన్న ఫ్లైఓవర్ కింద నుండి మళ్ళించారు. జిల్లా అధికారులు వేగంగా స్పందించడంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రహదారులు మూసివేయాలని వినతి

అంతకుముందు ప్రమాదకర రహదారులు నేషనల్ హైవేపై ఉన్నాయని వాటిని మూసివేయాలని జమైతే యూత్ క్లబ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మునావర్ ఖాన్, షేక్ సలీం, మోయిన్, మోషన్, నసర్, కిజర్ పాల్గొన్నారు.



ప్రమాద స్థలం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

హెయిర్ కటింగ్ షాపులు బంద్



నవతెలంగాణ-జన్నారం

అయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న అన్ని హెయిర్ కటింగ్ సెలూన్లను సోమవారం బందు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు నాగేందర్ నాయి, మద్రిపల్లి శేఖర్ తెలిపారు. మంగళవారం ఉదయం వరకు షాపులు మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. నాయి బ్రాహ్మణులంతా ఆలయాల్లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొనాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

● డీఐఈఓ నైతం శంకర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఐఈఓ నైతం శంకర్, అధ్యాపకులు

ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇతర కార్యాలయంలో టీజీజెఎల్ఏ క్యాలెండర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ అత్యంత ప్రాధాన్యమైనదని అన్నారు. ఆ దశలో విద్యార్థిని సన్మార్గంలో నడిపించి విద్యాభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. ఆదివాసి జిల్లాలో నాణ్యమైన విద్య అందించడానికి అధ్యాపకులు ఎప్పటికప్పుడు కృషి చేయాలని సూచించారు. అధ్యాపకులు తమకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సమస్యలు పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి నాయిని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్, ప్రధాన కార్యదర్శి మిర్యాల్కార్ శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు చంద్రయ్య, కుతుబ్బుద్దీన్, కోశాధికారి బాలకిషన్, ఉపాధ్యక్షులు సంతోష్, సెక్రటరీ రాజమౌళి, జాయింట్ సెక్రటరీ కిరణ్, మహిళా కార్యదర్శి సరిత పాల్గొన్నారు.

రేపు ఈజ్‌గాం ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఈజ్‌గాం ఆలయ హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించనున్నట్టు ఈఓ వేణుగోపాల్ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయంలో ఉదయం 11 గంటలకు దేవాదాయశాఖ పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

● అన్నదాన కార్యక్రమాలు

● హాజరైన పలువురు ప్రముఖులు

● ఎస్పీ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు



ఆసిఫాబాద్..

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా సోమవారం జిల్లాలోని ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ కోదండ రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు నిమ్మకంటి సంతోష్ శర్మ ఆలయ అర్చకుడు వినాయక శర్మల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకం, ఉత్సవ విగ్రహాల పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అయోధ్య రామాలయ ప్రత్యేక ప్రసారం కార్యక్రమాన్ని భక్తులు వీక్షించేందుకు భారీ ఎల్ఈడీని ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రాహ్మణవాడలోని భక్తులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు, దస్నాపూర్ గ్రామస్తులు భారీ ర్యాలీతో రామాలయానికి చేరుకున్నారు.

పూజల్లో పాల్గొన్న ప్రముఖులు

ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర నాయకురాలు సిద్ధంశెట్టి సుహాసిని, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న పాల్గొన్నారు.

ఎస్పీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా బందోబస్తును పర్యవేక్షించి, ట్రాఫిక్ కు ఎలాంటి అంతరం కలవకుండా పోలీస్ అధికారులకు సూచనలు, సలహాలు చేశారు.

వాంకిడి : మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలకేంద్రంలోని శివకేశవ ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల గుండా కొనసాగింది. అనంతరం శివకేశవ ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీలో వాంకిడి సర్పంచ్ బండె తుకారాం, శివాలయం కమిటీ చైర్మన్ గాదె ప్రవీణ్ పాల్గొన్నారు.



వాంకిడిలో..



రెబ్బెనలో..

బెజ్జూరు : మండలకేంద్రంలోని అయోధ్య శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన లైవ్ కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. సోమవారం ఆలయం ప్రాంగణంలో స్క్రీన్ ఏర్పాటుచేసి లైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం ఆన్‌లైన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారాముల విగ్రహాలను శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కౌటాల : మండల కేంద్రంలోని రామాలయ ప్రాంగణంలో సోమవారం శ్రీరామ ప్రాణప్రతిష్ఠ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాలయం నుండి సాయిబాబా ఆలయం వరకు శోభ యాత్ర నిర్వహించి తిరిగి రామాలయం వద్దకు చేరుకొని అయోధ్యలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శ్రీరామ ప్రాణప్రతిష్ఠ చేసిన లైవ్ షో ను భక్తులు తిలకించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మౌనీష్ యెల్క సత్తన్న, వెంకన్న, సత్యనారాయణ గౌడ్, ఆంజనేయులు గౌడ్, విలాస్ గౌడ్, కోలేటి ప్రకాష్, కుంచాల విజయ్, పెద్దపెల్లి భీమన్న, భువనగిరి సంతోష్, దౌలత్ పాల్గొన్నారు.

రెబ్బెన : మండలంలోని గోలేటిలో కోదండ రామాలయంలో అయోధ్య శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠలో భాగంగా హోమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో శ్రీరామ నామస్మరణ, హనుమాన్ చాలీసాతో మార్మోగాయి.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | జనవరి 23, 2024 | www.navatelangana.com

పోస్టుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

జాతీయ ఆరోగ్య మిషన్ కింద మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ పస్టుల నియామకానికి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. జీసీ.సుబ్బారాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిల్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ పోస్టులకు ఎంబీబీఎస్/ బీఏ ఎంఎస్/ బీఎస్సీ నర్సింగ్ / జీఎస్ఎం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, అర్హతగల అభ్యర్థులు 2020 సంవత్సరం కంటే ముందు ఉత్తీర్ణులై 6 నెలల కమ్యూనిటీ హెల్త్ బ్రిడ్జ్ కోర్సు పూర్తి చేసి ఉండాలని తెలిపారు. దరఖాస్తు ఫారం, ఇతర వివరాలకు అధికారిక వెబ్సైట్ మంచిర్యాల.తెలంగాణ.జీఓవీ.ఇన్‌లో సంప్రదించాలని, పూర్తి చేసిన దరఖాస్తుతో ధ్రువీకరించిన సర్టిఫికెట్స్ నకలు ప్రతులను జత చేసి ఈ నెల 23 నుండి 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

ఇటుక బట్టీలవద్ద వర్క్ సైట్ స్కూల్ ప్రారంభం

నవతెలంగాణ-హాజీపూర్



ఆపరేషన్ స్మైల్‌లో బాగంగా మండలంలోని బుగ్గ గట్టు ప్రాంతంలోని ఇటుకల బట్టీల్లో పని వద్ద పాఠశాలను సోమవారం అధికారులు ప్రారంభించారు. ఇతర రాష్ట్రాల నుంచి ఇటుకబట్టీల్లో పనికి వచ్చిన వారి కుటుంబాల్లో 50 మంది బడీడు పిల్లల్ని గుర్తించి వారి బాషలనే విద్యను బోధించేల ఇటుక బట్టీల నిర్వాహకుల సహకారంతో ఒక ట్యూటర్‌ను ఏర్పాటు చేసి వారికి పలక బలపం, నోట్ పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ స్మైల్ ఎస్సై విజయ్ కుమార్, ఎంఈఓ పోచన్న, చైల్డ్ వెల్ఫేర్ అధికారి ఇందిరా, సెక్టరియల్ అధికారులు చౌదరి, మూర్తి పాల్గొన్నారు.

సులబ్ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలం గుర్తించండి

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలో సులబ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని గుర్తించాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశించారు. భీమారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎమ్మార్సీ భవనాన్ని సోమవారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. దీనికి ముందు మండలానికి వచ్చిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి జడ్పీటీసీ భుక్య తిరుమల లక్ష్మన్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండల పరిధిలో వసతుల కల్పన అభివృద్ధి పనుల విషయమై స్థానిక జడ్పీటీసీ భుక్య తిరుమల లక్ష్మన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా ఆయన సానుకూలంగా స్పందించారు. గత ప్రభుత్వ ఖజానా ఖాళీ చేసిందని, కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా గ్రామ పంచాయతీలలో అంచెలంచలుగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. మండల ప్రజల అవసరాల మేరకు మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో 108 అంబులెన్స్ అవసరాన్ని జడ్పీటీసీ గుర్తు చేశారు. భూర్గుపల్లి గ్రామ పంచాయతి పరిధిలో విద్యుత్ సబ్ స్టేషన్ విషయంలో చొరవ తీసుకోవాలని కోరారు. యువకుల సౌకర్యార్థం మండల కేంద్రంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వంబర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, స్థానిక సర్పంచ్ గద్దె రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్, నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, పొడేటి రవి పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ



నవతెలంగాణ-జన్నారం

అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని, మండలంలోని అన్ని గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గ్రామాల్లో ఉదయం నుంచే ఇంటిపై శ్రీరాములు జెండాలు కడుతూ కాషాయ తోరణాలతో గ్రామాలు కాశాయమయం అయ్యాయి. పట్టణంలోని శ్రీరాముని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామ గోదావరి నది ఒడ్డున వెలసిన శ్రీ చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. మండల కేంద్రంలోని మేదరి వాడలో హనుమాన్ ఆలయంలో శ్రీరాముని చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు. కిష్టాపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు హనుమాన్ భక్తులు గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. తిమ్మాపూర్ గ్రామంలోని రామాలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం గ్రామ సర్పంచ్ జాడి గంగాధర్ సహకరించినట్లు కమిటీ నిర్వాహకులు యుగంధర్ రవి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో, ఎంపీటీసీ వెంకటస్వామి, కిష్టాపూర్ గ్రామస్తులు వాసాల నరేష్, గట్టు మహేష్, బండారి స్వామి పాల్గొన్నారు.

దండేపల్లి : అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో రామాలయాల వద్ద ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం వేళలో ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటాలు, నృత్యాలతో మంగళహారతితో ఘనంగా స్వాగతం పలికారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

మామిడిపల్లి గ్రామానికి చెందిన సలీం అనే ముస్లిం వ్యక్తి అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవ సందర్భంగా నుదుట తిలకం దిద్దుకుని చేతిలో కాశయ్య జెండా పట్టుకుని గ్రామంలోని గడపగడపకు తిరుగుతూ హిందూ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను హిందువులంతా అభినందించారు.

రామకృష్ణాపూర్ : అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్టాపన సందర్భంగా పట్టణంలోని స్థానిక నాగార్జునకాలని యూత్ ఆధ్వర్యంలో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు చిన్న పెద్ద తేడా లేకుండా పూజా కార్యక్రమంలో పాల్గొని జై శ్రీరామ్ జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

మహానీయుల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

నవతెలంగాణ-జైపూర్

యువత మహానీయులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని జైపూర్ ఏసీపీ బాలుసాని మోహన్ సూచించారు. సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్ నాయకులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన మహానీయులు అడుగుజాడల్లో నడవడంతో పాటు వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని ఏసీపీ మోహన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రామగిరి రాము మాదిగ, ప్రధాన కార్యదర్శి నిట్టూరి ప్రశాంత్ మాదిగ, ప్రచార కార్యదర్శి రాకేష్ మాదిగ, తుంగపిండి లక్ష్మన్ మాదిగ, ఎమ్మెస్ఎఫ్ జిల్లా నాయకులు కలగూర సునీల్ మాదిగ, సంతోష్ మాదిగ పాల్గొన్నారు.



సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంచాలి



సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంపుతో పాటు దేశ వ్యాప్తంగా అన్ని రకాలైన వ్యాధులకు అపరిమితమైన వైద్య సేవలు అందించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్‌ను కలిసిన అసోషియేషన్ నాయకులు రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారమార్గం చూపించాలని కోరారు. సింగరేణి ఆస్పత్రుల్లో సీపీఆర్ ఎంఎస్ మెడికల్ కార్డుల్లో కోత విధించరాదని కోరిన నాయకులు అధికారులకు, ఉద్యోగులకు ఒకే రకమైన మెడికల్ కార్డు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అభయహస్తం గ్యారంటీ స్కీంలు విశ్రాంత సింగరేణి ఉద్యోగులకు వర్తింపజేయాలని, తెల్లరేషన్ కార్డు, వృద్ధాప్య పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా రూ.20 లక్షల గ్రాట్యూటీ సీలింగ్ 2016 జూలై 1 నుంచి చెల్లించడంతో పాటు రిటైర్డ్ ఉద్యోగుల ఇతరత్ర డిమాండ్ల పట్ల యాజమాన్యం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని వినతీ పత్రంలో పేర్కొన్నారు. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల డిమాండ్ల పట్ల సీఎండీ బలరామ్ నాయక్ సానుకూలంగా స్పంచడంతో పాటు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆళవందార్ వేణుమాదవ్ తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బీరయ్య, సంయుక్త కార్యదర్శి నర్సింగ్‌రావు, కొత్తగూడెం ఏరియా రిటైర్డ్ కార్మిక సంఘం నాయకులు మాతంగి లింగయ్య, లక్ష్మినారాయణ, భూపాల్‌పల్లి ఏరియా నాయకులు రాజిరెడ్డి, సమ్మిరెడ్డి, రాజయ్య, ఖమ్మం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, మంచిర్యాల జిల్లా నాయకులు గజెల్లి వెంకటయ్య, ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అడిషనల్ ప్రధాన కార్యదర్శి రంగయ్య, దమ్మలపాటి శేషయ్య, కేంద్ర కార్యదర్శి వెంకట్‌తో పాటు వివిధ ఏరియాలకు చెందిన 300 మంది సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదల ఇండ్లకు ఉచిత ఇసుక సరఫరా

- గతేడాది కంటే ట్రిప్పుకు రూ.50 తగ్గింపు
- వేంపల్లి ఇసుక రీచ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

నవతెలంగాణ-హాజీపూర్

ఇండ్లు నిర్మించుకునే పేదలకు ఉచిత ఇసుక రవాణా చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు తెలిపారు. మండలంలోని వేంపల్లి గ్రామ శివారు గోదావరిలో సోమవారం అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని అన్నారు. వేంపల్లి ఇసుక రీచ్ ద్వారా తక్కువ ధరలో నాణ్యమైన ఇసుక సరఫరా చేయనున్నట్లు తెలిపారు. గతేడాది కంటే ప్రస్తుతం ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పుపై రూ.50 తగ్గిస్తున్నట్లు పేర్కొన్నారు. వేంపల్లి గ్రామస్థుల కు తక్కువ ధరకు ఇసుక సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఇల్లు నిర్మించుకునే పేదలు ధవ పత్రాలతో ఆన్లైన్ లో ధరఖాస్తు చేసుకుంటే నేరుగా ఇంటికే ఉచితంగా ఇసుక వస్తుందన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన నెల రోజుల సమయం లోనే గూడెం లిఫ్ట్ ద్వారా లక్షెట్టిపేట్, దండేపల్లి, హాజీపూర్ మండలాల రైతులకు సాగు నీరు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మంచిర్యాల, నస్పూర్ పట్టణాల ప్రజలకు తాగు నీటికి ఇబ్బందులు రాకుండా చుస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజల కోసం రాబోవు రోజుల్లో చేపట్టాల్సిన పనులపై సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏడీ బాలు, స్థానిక సర్పంచ్ వోలపు శారద, ఎంపీటీసీలు దేగ బాపు, ఒడ్డే బాలరాజు, డీటీ హరిత, అర్ఐ మంగ, కాంగ్రెస్ మండల అద్యక్షుడు తోట రవి పాల్గొన్నారు.

బదిలీలు, ఉద్యోగోన్నతులు పారదర్శకంగా చేపట్టాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్



నవతెలంగాణ-నస్పూర్

అంగన్‌వాడీ ఉద్యోగుల బదలీలు, ఉద్యోగోన్నతులు పారదర్శకంగా చేపట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగుల బదిలీల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో ఐసీడీఎస్ పరిధిలో అంగన్‌వాడీ ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్ల దరఖాస్తుల ప్రక్రియను జిల్లా అధికారులు గత సంవత్సరం జులై నెలలో ప్రారంభం చేయడం జరిగిందని, నేటికి నెలలు గడుస్తున్న అధికారులు మాత్రం బదిలీలా ప్రక్రియను ఇంకా పూర్తి చేయలేదన్నారు. అదే విదంగా కొంతమంది వ్యక్తులు బదిలీలా విషయంలో అధికారులను ప్రలోబాలకు గురిచేసి, వారికి అనుకూలమైనా వారికి సులభంగా బాధిలీలు చేసుకునే అవకాశలు ఉన్నాయని, అదే విదంగా ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు, వారి అర్హతలను వారి కార్యాలయంలోని నోటిస్ బోర్డుపై పెట్టలేదన్నారు. కావున ఎలాంటి అవకతవకలు జరగకుండా అర్హులైన ఉద్యోగులకు న్యాయం చేసే విదంగా కలెక్టర్, డీడబ్ల్యూఓ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ కాలనీలోని ప్రాణహిత స్టేడియంను 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్ల పనులన్నీ వీలైనంత తొందరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జీఎం సంజీవరెడ్డి సూచించారు. సోమవారం ప్రాణహిత స్టేడియంను సందర్శించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేడియంలో మొట్టమొదటిసారిగా గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా వేడుకలలో పాల్గొనే వారందరికీ కావలసిన సదుపాయాలను కల్పించాలని అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో వివిధ గనులలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేయబడిన వారికి సన్మానం, మార్చ్ ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వేడుకలలో ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు, పుర ప్రజలు అందరూ పాల్గొని దిగ్విజయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం కె రఘు కుమార్, డీజీఎం పర్సనల్ పి.అరవిందరావు, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, సీనియర్ పీఓఓ కాంతారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సివిల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజావాణి ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్



ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కరానికి అధికారుల సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ బి.రాహుల్, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీలు వి.రాములు, హరికృష్ణలతో కలిసి ప్రజావాణి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో మన జిల్లాకు వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి వెంటనే జవాబు ఇచ్చి అర్జీదారులకు న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను వచ్చే ప్రజావాణిలోగా పూర్తి స్థాయిలో పరిష్కరించే విధంగా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

ఎస్టీపీపీ ఉద్యోగాల్లో మిట్టపెల్లి గ్రామస్తులకు అవకాశం

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో మిట్టపల్లి యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. సోమవారం మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యేను కలిసి మిట్టపల్లి గ్రామస్థులు ఎస్టీపీపీ ఉద్యోగాల విషయమై వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా ఈ నెల 26న మిట్టపల్లి గ్రామంలో నిర్వహించ తలపెట్టిన ఎడ్ల పందాలకు హాజరు కావాలన్న గ్రామస్థుల కోరిక మేరకు ఆయన అంగీకరించారు. దీనికి ముందు చెన్నూర్ నియోకవర్గ కేంద్రంలో కాక వెంకటస్వామి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు షీల్డులు అందజేశారు. అదేవిధంగా కోటపల్లి మండలం సిర్సా గ్రామంలో ఇటీవల మృతి చెందిన గుడిసెల మొండయ్య కుటుంబ సభ్యులను కలిసి పరమార్శించారు. దేవులవాడల మృతి చెందిన ఆసరెల్లి లక్ష్మి కుటుంబ సభ్యులను స్థానిక నాయకులతో కలిసి పరమార్శించారు. జైపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన మద్దుల సరమ్మ కుటుంబ సభ్యలను పరమార్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫయాజోద్దీన్, మండల పరిషత్ కోఆప్షన్ మెంబర్ జైనోద్దీన్ పాల్గొన్నారు.

అంతర్గత అభ్యర్థులకు పారదర్శకంగా పరీక్షలు

- ఎస్ఓ టూ జీఎం రఘు కుమార్



నవతెలంగాణ-నస్పూర్

ఏరియా వర్క్ షాప్‌లో జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి ఆదేశానుసారం శ్రీరాంపూర్ ఏరియాలోని అంతర్గత అభ్యర్థులకు టెండల్, టెండల్ సూపర్‌వైజర్, కార్పెంటర్, బిట్ షార్ప్ నర్ ఖాళీల భర్తీకి ప్రాక్టికల్ పరీక్షలను సోమవారం పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని ఎస్ఓ టు జీఎం రఘు కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన ఉద్యోగులకు విడివిడిగా ప్రాక్టికల్ పరీక్షలను ప్రాక్టికల్ పరీక్ష కమిటీ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాక్టికల్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని, అలాగే సోమవారం నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షల్లో తమ ప్రతిభను ప్రదర్శించిన వారికి ప్రమోషన్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, ఎస్ఆర్పీ-1 అండ్ ఎస్ఆర్పీ-3,3ఏ గనుల ఏజెంట్ గోపాల్ సింగ్, ఏరియా వర్క్ షాప్ ఇన్‌ఛార్జి మల్లయ్య, డీవై పీఎం రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటర్ దినోత్సవం సందర్భంగా వ్యాస రచన పోటీలు

నవతెలంగాణ-తాండూర్



ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జడ్పీహెచ్ఎస్ తంగళ్ళపల్లి పాఠశాలలో హై స్కూల్ విద్యార్థులకు మండల స్థాయిలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలను సోమవారం ఎంఈఓ వాసాల ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపన్యాస పోటీలో విద్యా భారతి ఉన్నత పాఠశాల విద్యార్థి ఏం విశ్వతేజ పదవ తరగతి ప్రథమ స్థానంలో నిలువగా, జడ్పీఎస్ఎస్ తంగళ్ళపల్లి పాఠశాల విద్యార్థిని ఎం కావ్య వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానంలో నిలిచారు. గెలుపొందిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో జడ్పీఎస్ఎస్ మంచిర్యాల బాలుర పాఠశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించబడతయని గాని ఎంఈఓ తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు ఐ విద్యాసాగర్, ప్రకాష్, నరేందర్ వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మల్లేశం వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యా భారతి ఉపాధ్యాయులు రాజశేఖర్ పాల్గొన్నారు.

రేపు మినీ జాబ్ మేళా

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో 24వ తేదీన మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక్ వెంకటరమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినయ్ ఆటోటెక్ ప్రయివేట్ లిమిటెడ్ మంచిర్యాలలో పని చేసేందుకు సేల్స్ ఎగ్జిక్యూటివ్-10 (డిగ్రీ అర్హత), మెకానిక్ హెల్పర్-6 (ఐటీఐ/డిప్లొమా), కమర్షియల్ వెహికల్ డ్రైవర్-1(బ్యాడ్జ్ లైసెన్స్), అకౌంటెంట్-1 (డిగ్రీ, టాలీ) పోస్టుల భర్తీకి జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని, 18-25 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని తెలిపారు. వివరాలకు 9963452486, 9059486633 నెంబర్లలో సంప్రదించవచ్చని, అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ మినీ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.